క్లుప్తంగా

ముగిసిన పాలీసెట్ కోచింగ్

నిజామాబాద్‌అర్బన్: నగరంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పాలీసెట్ కోచింగ్ ఆదివారం ముగిసింది. ఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో జరిగిన ఈ ముగింపు కార్యక్రమంలో నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌మోహన్ పాల్గొని, మాట్లాడారు. ఏబీవీపీ నిర్మాణాత్మక కార్యక్రమాలు చేపట్టడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. బడుగు, బలహీన విద్యార్థులకు ఉచిత కోచింగ్‌లు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. నాయకులు వెంకటకృష్ణ, సునీల్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ నోటిఫికేషన్ ఇవ్వాలి

నిజామాబాద్‌అర్బన్: ఎస్సెస్సీ ఫలితాలు వచ్చి రోజులు గడుస్తున్నా నేటి వరకు ట్రిపుల్ ఐటీలో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ ఎందుకు ఇవ్వలేదని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రాజేశ్వర్ ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే ట్రిపుల్ ఐటీలో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. నగరంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నోటిఫికేషన్ రాకపోవడం వల్ల ఎంతో మంది విద్యార్థులు నష్టపోయే అవకాశం ఉందన్నారు. ఇంటర్ అడ్మిషన్లు గడువు ముగుస్తున్న తరుణంలో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారన్నారు. పీడీఎస్‌యూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు సరికావు

సిరికొండ: అనారోగ్యం వల్ల ఆస్పత్రికి వెళుతున్న సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ అజ్ఞాత దళ నాయకులు రాజన్న, జీవన్, దేవ్‌రెడ్డిలతో పాటు మరొకరిని వరంగల్ శివారులో పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని జిల్లా కార్యదర్శి భాస్కర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అక్రమ అరెస్టులను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. అరెస్టు అయిన వారికి ఎలాంటి ప్రాణహాని తలపెట్టకుండా వెంటనే కోర్టులో హాజరు పరచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూంబింగ్ పేరుతో ఖమ్మం–వరంగల్ ఏజెన్సీ ప్రాంతాల్లో కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలు తీవ్ర నిర్బంధం కొనసాగిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. న్యూడెమొక్రసీ పార్టీని దెబ్బతీయాలనే ఉద్దేశంతో పోలీసులు ఈ చర్యలకు పాల్పడుతున్నారన్నారు.

పద్మశాలీలు అన్ని రంగాల్లో రాణించాలి



నిజామాబాద్‌నాగారం: పద్మశాలీలు అన్ని రంగాల్లో రాణించాలని కొండా లక్ష్మణ్ బాపూజీ పద్మశాలి అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పెంటం దత్తాద్రి అన్నారు. నగరంలోని బస్వాగార్డెన్‌లో ఆదివారం పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన పద్మశాలీ విద్యార్థులకు సన్మానం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పద్మశాలీలు ఉన్నత స్థాయికి ఎదగడానికి ఆర్థికంగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. బాపూజీ ఆశయ సాధనకే ఈ కమిటీ ఏర్పాటు చేశామన్నారు. సంఘం సలహాదారులు సత్యపాల్, భీమర్తి రవి, సురేందర్, సచ్చితానంద్ తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ హెల్త్ మిషన్‌ను వినియోగించుకోవాలి



బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు నేషనల్ హెల్త్ మిషన్ టీం సభ్యులు సంచరిస్తారని పోచంపాడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి రాకేశ్ అన్నారు. మండల కేంద్రంలోని ఏర్పాట్లను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ టీం సభ్యులు నేషనల్ హెల్త్ ప్రోగ్రాంలు చేస్తారని పేర్కొన్నారు. ఇమ్యునైజేషన్ కార్డులు, ఎన్‌సీడీ రికార్డ్స్, టీబీ కార్డు వివరాలు ముఖాముఖిగా మాట్లాడుతారని అన్నారు. వారి సేవలను ప్రజలు వినియోగించుకోవాని కోరారు. ఆయన వెంట వైద్యా సిబ్బంది తదితరులు ఉన్నారు.

అధ్యాపకుల ప్రచారం



బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు విద్యార్థులను పంపించాలని కోరుతూ మండల కేంద్రంలో కళాశాల ప్రిన్సిపాల్ చిన్నయ్య ఆధ్వర్యంలో అధ్యాపకులు ఆదివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కళాశాలలో అందిస్తున్న కోర్సుల గురించి విద్యార్థుల తల్లితండ్రులు, విద్యార్థులకు వివరించారు. ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్లు తీసుకోవాలని కోరారు.

టార్గెట్ సాధించినా వేధింపులే!

- నగరంలో లక్ష్యాన్ని మించి పన్ను వసూలు చేసిన రెవెన్యూ సిబ్బంది
- అయినా వేధింపులు, మెమోలు జారీ
- మున్సిపల్ రెవెన్యూ అధికారి తీరుతో మనోవేధనకు గురవుతున్న వైనం

నగర మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రమేశ్ (పేరుమార్చం) అనే వ్యక్తి రెవెన్యూ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఇటీవల పన్ను వసూళ్లలో లక్ష్యానికి అనుకూలంగా పని చేసి అందరి మన్ననలు పొందారు. అయినా చీటికిమాటికీ రమేశ్ లాంటి ఉద్యోగులకు రెవెన్యూ అధికారి అనవసరంగా మెమోలు ఇవ్వడంతో పాటు మానసికంగా వేధిస్తున్నారు. టార్గెట్‌ను సాధించినా ఉద్యోగులు వేధింపులకు గురికావడంతో తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు.



నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ మున్సిపాలిటీలో రెవెన్యూ విభాగం ప్రధానమైంది. ఈ విభాగం ద్వారానే మున్సిపాలిటీలో ఆర్థిక కార్యకలాపాలు జరుగుతాయి. అలాగే నగరంలో పన్నులు వసూలు చేయడం సహ ఇతర ఆర్థికపరమైన విధులను సిబ్బంది నిర్వహిస్తారు. ఈక్రమంలో ఇటీవల నగరంలో పన్ను వసూళ్లను సిబ్బందికి టార్గెట్ విధించి వసూలు చేయించారు ఉన్నతాధికారి. సిబ్బంది కూడా టార్గెట్‌కు అనుగుణంగా పన్నులను వసూలు చేశారు. అయినా కూడా సిబ్బందిపై శాఖ అధికారి వేధింపులకు గురిచేయడంతోపాటు, మెమోలు జారీ చేయడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ.40కోట్లు పన్ను వసూలు..

నిజామాబాద్ నగరంలో 60 డివిజన్లు ఉండగా, సుమారు 3.99లక్షల జనాభా నివసిస్తోంది. 83,150 పైగా నివాసాలున్నాయి. మున్సిపల్ అధికారులు నగర పరిధిలో ప్రతి ఏడాది రూ. 33కోట్ల వరకు ఆస్తి పన్ను వసూళ్లు చేస్తారు. ఈ ఏడాది మాత్రం రూ. 40కోట్ల ఆస్తి పన్నులు వసూళ్లు చేశారు.

ఈ సంవత్సరం గత ఏడాది కంటే ఎక్కువగా శ్రమించి, టార్గెట్‌ను మించి పన్నులు వసూళ్లు చేశారు. పన్ను వసూళ్ల కోసం ఆర్ఐ–08, బిల్‌కలెక్టర్–27, వీఆర్ఏలు–10, అసిస్టెంట్‌లు–15 మంది వరకు విధులు నిర్వహించారు. నెలన్నర రోజులపాటు ఉదయం 7గంటల నుంచి రాత్రి 9గంటల వరకు పలుమార్లు అర్ధరాత్రుల వరకు సిబ్బంది శ్రమించారు. ఇన్‌చార్జి ఆర్వో, డిప్యూటీ కమిషనర్ ప్రత్యేకంగా శ్రమించడంతో లక్ష్యాన్ని పూర్తిచేశారు.

మెమోలతో ఇక్కట్లు..

పనుల్లో నిర్లక్ష్యం చేస్తే సీరియస్ వార్నింగ్‌లు ఇవ్వడం పరిపాటే. లక్ష్యానికి మించి పనులు చేసినా అనవసర వేధింపులతో పాటు, మెమోలు ఇవ్వడంతో సిబ్బంది మనోవేదనలో ఉంటున్నారు. లక్ష్యానికి అనుగుణంగా ఆస్తి పన్నులు రాబట్టినా.. రెవెన్యూ అధికారి అనవసరంగా వేధింపులకు గురి చేస్తున్నాడని, మెమోలు ఇస్తూ ముప్పుతిప్పలు పెడుతున్నారని ఆవేదన చెందుతున్నారు.

దీంతో ఇటీవల తమను శాఖ అధికారి మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారని, ఇబ్బందులు పెట్టుతున్నారని కొంతమంది ఉద్యోగులు నేరుగా మున్సిపల్ కమిషనర్‌కు విన్నవించారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో సిబ్బంది నేడు రాజకీయ పార్టీ నాయకులతో కలిసి కమిషనర్‌కు ఫిర్యాదు చేసి సమస్యలకు పరిష్కారం చూపాలని కోరనున్నట్లు తెలిసింది.

విగ్రహాల తయారీలో సిర్నాపల్లి యువకుడు

- అద్భుత కళతో జిల్లా వ్యాప్తంగా ఖ్యాతి పొందుతున్న మల్లె శోభన్



శోభన్ రూపొందించిన ప్రొ. జయశంకర్ విగ్రహం



హనుమాన్ విగ్రహం



విగ్రహాల తయారీలో శోభన్

ఇందల్వాయి: మండలంలోని సిర్నాపల్లి గ్రామానికి చెందిన మల్లె శోభన్ అనే యువకుడు విగ్రహాల తయారీలో జిల్లా వ్యాప్తంగా ఖ్యాతి గడిస్తున్నాడు. అనుకోని పరిస్థితుల్లో ఈ వృత్తిలోకి రాగా, ఉత్తమ ప్రతిభతో ప్రశంసలు పొందుతున్నాడు.శోభన్ ఏడో తరగతి వరకు చదువుకొని, ఉపాధి కోసం బైక్ మెకానిక్‌గా పని చేసేవాడు. అదనపు ఆదాయం కోసం కూరగాయల వ్యాపారం కూడా చేశాడు. అంతే కాకుండా విగ్రహాలు తయారు చేసే మహారాష్ట్రకు చెందిన భరత్ అనే వ్యక్తి వద్ద సహాయకుడిగా చేరాడు. కొన్నేళ్ల క్రితం గన్నారంలో ఏర్పాటు చేయాల్సిన శివాజీ విగ్రహ తయారీ కోసం భరత్ డబ్బులు అడ్వాన్స్ తీసుకొని, వ్యక్తిగత కారణాలతో విగ్రహం చేయలేక సొంతూరికి వెళ్లిపోయాడు. దీంతో అడ్వాన్స్ ఇచ్చిన వారి నుంచి శోభన్‌పై ఒత్తిడి పెరగడంతో, అతడు విగ్రహం తయారు చేసే బాధ్యతలను చేపట్టాడు. ఏ మాత్రం అనుభవం లేకున్నా మొక్కవోని దీక్ష, పట్టుదలతో విగ్రహాన్ని అద్భుతంగా సకాలంలో తయారు చేసి ఇచ్చాడు. ఈ విగ్రహం ఏర్పాటుతో శోభన్‌లో విశ్వాసం పెరిగింది.



ఛత్రపతి శివాజీ విగ్రహం

యాభైకి పైగా విగ్రహాలు

శివాజీ విగ్రహం చూసి జిల్లా నలుమూలల నుంచి అతడికి ఆర్డర్లు పెరిగాయి. దీంతో గత మూడేళ్లుగా యాభైకి పైగా వివిధ రకాల విగ్రహాలను తయారు చేశాడు. ప్రస్తుతం విగ్రహాల తయారీలోనే శోభన్ పూర్తిగా నిమగ్నమయ్యాడు. ఇటీవల కాలంలో అతడు శివాజీ, అంబేడ్కర్, హనుమాన్, దేవి మాతా, ప్రొ. జయశంకర్, సరస్వతి విగ్రహాలను తయారు చేశాడు. తను తయారు చేసిన విగ్రహాలను చూసి వరుసగా ఆర్డర్లు వస్తున్నాయని, ఆర్థికంగా కూడా నిలదొక్కుకున్నానని ఆయన ఆనందం వ్యక్తం చేస్తున్నాడు.

రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందాలి..

అన్ని రకాల విగ్రహాల తయారీలో పూర్తిస్థాయిలో నైపుణ్యం పొందేందుకు కృషి చేస్తున్నా. హనుమాన్ జయంతి సందర్భంగా సిర్నాపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన 25అడుగుల హనుమాన్ విగ్రహ తయారీ సంతృప్తి ఇచ్చింది. నాకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తున్న గ్రామస్తులకు రుణపడి ఉంటా. విగ్రహాల తయారీలో రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందాలి.

–శోభన్, కళాకారుడు, సిర్నాపల్లి

అద్దె భవనంలోకి మహాత్మా జ్యోతీబాపూలే పాఠశాల

- ఇప్పటి వరకు బీసీ వసతి గృహంలో కొనసాగిన వైనం



మోర్తాడ్‌లో అద్దెకు తీసుకున్న పాఠశాల భవనం

మోర్తాడ్: అరకొర వసతులతో నెట్టుకొచ్చిన మహాత్మా జ్యోతీబాపూలే గురుకుల పాఠశాలకు విశాలమైన అద్దె భవనం లభించింది. బీసీ విద్యార్థి వసతి గృహంలో కొనసాగిన ఈ పాఠశాల అక్కడ సరైన వసతులు లేకపోయినా ఆరేళ్ల కొనసాగింది. 150 మంది విద్యార్థులకు సరిపడే భవనంలో 400ల మంది విద్యార్థులకు వసతి కల్పించడం ఎంతో కష్టమైంది. దీంతో అనేక మంది విద్యార్థులు టీసీలు తీసుకుని తమ ఇళ్లకు చేరి మరో పాఠశాలలో చేరారు. దీంతో వసతి లేకపోవడంతో డిచ్‌పల్లి మండలం ధర్మారం గురుకుల పాఠశాలలోనే ఇక్కడి ఇంటర్ విద్యార్థులకు వసతి కల్పించి చదువు చెప్పారు. బీసీ గురుకుల పాఠశాలను వసతి గృహంలో కొనసాగిస్తే ఏటేటా విద్యార్థుల సంఖ్య తగ్గిపోయే అవకాశం ఏర్పడింది. దీనిని దృష్టిలో ఉంచుకున్న స్థానిక ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుల బృందం పాఠశాల విద్యార్థులకు వసతి, తరగతుల నిర్వహణకు విశాల మైన భవనం అవసరమని ఉన్నతాధికారులకు నివేదించారు. స్థానికంగా ఓ ప్రైవేటు పాఠశాల కోసం నిర్మించిన భవనాన్ని బీసీ గురుకులం కోసం అద్దెకు తీసుకున్నారు. ప్రతి నెలా రూ.30వేల వరకు అద్దె చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్న బీసీ గురుకుల సొసైటీ ఉన్నతాధికారులు పాఠశాల తరలింపునకు పచ్చజెండా ఊపారు. 2024–25 విద్యా సంవత్సరం తరగతు లు కొత్త భవనంలోనే కొనసాగనున్నాయి. ఇప్పటికే అడ్మిషన్లను ఈ కొత్త భవనంలోనే స్వీకరిస్తున్నారు.

ధర్మారంలో వసతి కల్పించి..

ఇక్కడ వసతి లేకపోవడంతో మోర్తాడ్‌లోని ఇంటర్ విద్యార్థులకు ధర్మారంలో వసతి కల్పించి తరగతులు నిర్వహించారు. ఇప్పుడు విశాలమైన భవనాన్ని అద్దెకు తీసుకోవడంతో ఇంటర్ విద్యార్థులకు ఇక్కడే తరగతుల నిర్వహణ కొనసాగించాలనే డిమాండ్ వినిపిస్తోంది. మోర్తాడ్ పాఠశాల పేరుపై ధర్మారంలో తరగతులను నిర్వహించడానికి స్వస్తిపలకాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి. ఇప్పటికే ఒక ఇంటర్ బ్యాచ్ తమ చదువును పూర్తి చేసుకుంది. ఇప్పుడు రెండో బ్యాచ్‌కు ఇక్కడే తరగతులను కొనసాగించడం మేలు అనే భావన వ్యక్తమవుతోంది. దీనిపై ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

ఇబ్బందులు లేకుండా చదువులు

అద్దె భవనంలోకి పాఠశాలను తరలించడం వల్ల విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చదువులు కొనసాగనున్నాయి. అంతేకాకుండా మంచి వసతి పొందడానికి అవకాశం ఏర్పడింది. అద్దె భవనంలోకి పాఠశాలను తరలించడానికి సహకరించిన ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు.

– శ్రీకర్, ప్రిన్సిపాల్

దరఖాస్తు చేసుకోవాలి

ఆర్మూర్: ఆర్మూర్ డివిజన్ పరిధిలో పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో 90 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించిన మేరు కులస్తులైన విద్యార్థులకు పట్టణ మేరు సంఘం ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దీకొండ కిషన్, కొక్కు వినోద్ ఆదివారం తెలిపారు. ఉత్తమ ఫలితాలు పొందిన విద్యార్థులు 9948924935, 9948974782 నంబర్లను సంప్రదించాలని కోరారు.

సమాజానికి మార్గదర్శి

ఆర్మూర్: పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా పోరాటాలు చేసి, రాజకీయాలకు కొత్త మార్గాన్ని చూపి సమాజానికి మార్గదర్శిగా నిలిచిన పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ప్రతీ ఒక్కరికి ఆదర్శప్రాయమని సీపీఎం ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేశ్ అన్నారు. పట్టణంలోని శాస్త్రీనగర్‌లో ఉన్న సీపీఎం కార్యాలయంలో సుందరయ్య 39వ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి కుతాడి ఎల్లయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం వెంకటేశ్ మాట్లాడుతూ.. అసమానతలకు వ్యతిరేకంగా ఆయన చేపట్టిన ఉద్యమాలను వివరించారు. కార్యక్రమంలో సభ్యులు కొండ గంగాధర్ ఉన్నారు.



నేటి చిత్రం..



నగరంలోని మహాలక్ష్మి కాలనీలో వీధి కుక్కల సంచారం

నగరంలో వీధి కుక్కల బెడద

నగరంలోని మహాలక్ష్మి కాలనీలో వీధి కుక్కలు విపరీతంగా సంచరిస్తున్నాయి. రాత్రి వేళల్లో ప్రజల వెంబడి పడి మరీ ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. దీంతో కాలనీవాసులు బయటకి వెళ్లాలంటే జంకుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి వీధి కుక్కల బెడదను అరికట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

ఘనంగా బోనాల ఊరేగింపు



డిచ్‌పల్లి ఖిల్లా గ్రామంలో పెద్దమ్మ తల్లికి బోనాలు తీసుకెళ్తున్న ముదిరాజ్ సంఘ సభ్యులు

ఆధ్యాత్మికం

డిచ్‌పల్లి: మండలంలోని డిచ్‌పల్లి ఖిల్లా గ్రామంలో పెద్దమ్మ తల్లి (వనదుర్గాదేవీ) ఆలయ వార్షికోత్సవాలు ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ముదిరాజ్ సంఘం సభ్యులు ఇంటికొకరు చొప్పున బోనాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లారు. అమ్మవారికి బోనాలను, నైవేధ్యాలను సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. వేడుకల్లో ముదిరాజ్ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ మండలంలో..

సిరికొండ: మండలంలోని చిన్న వాల్గోట్ గ్రామంలో ఆదివారం పోచమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కుల సంఘాల వారీగా బోనాలను డప్పువాయిద్యాలతో ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లారు. అమ్మవార్లకు నైవేద్యాలు, బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పుష్కలంగా పండాలని అమ్మవారిని గ్రామస్తులు వేడుకున్నారు.



చిన్నవాల్గోట్ గ్రామంలో..

వికసించిన మే పుష్పాలు



వేసవిలో మాత్రమే వికసించే మే పుష్పాలు నగరంలో కనువిందు చేస్తున్నాయి. ముబారక్ నగర్‌లో నివసిస్తున్న కోగంటి వెంకటేశ్వరరావు ఇంట్లో ఏకంగా ఐదు మే పుష్పాలు విరబూశాయి. నాలుగు రోజుల క్రితం మొగ్గలు ఏర్పడి ఆదివారం నాటికి పువ్వులుగా మారాయి. ఏడాదంతా ఆకులతో ఉండే చెట్టుకు మే నెలలోనే పుష్పాలు పూస్తాయని యజమాని వెంకటేశ్వరరావు తెలిపారు.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

స్టేడియం నిర్మాణానికి విరాళం

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియ నిర్మాణానికి మండల కేంద్రానికి చెందిన ఫన్నీర్ అభినయ్ రూ. 5 వేల విరాళం అందించారు. ఈ సందర్భంగా కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి క్రీడలను ప్రోత్సహించాలన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	73,200	వెండి (కిలో)	87,500
22 క్యారెట్స్	67,525	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్డ్	200
	(కిలోకు)	లైవ్	180
స్కిన్‌లెస్	240	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	12	24	గాజరుగడ్డ	35	50
బెండకాయ	30	50	పచ్చిమిర్చి	40	60
జీరకాయ	60	80	దోసకాయ	25	50
దొండకాయ	30	50	ఆలుగడ్డ	30	50
బీర్నీసుకాయ	100	130	గోబి గడ్డ	25	50
కాకరకాయ	40	60	గోబి పువ్వు	30	50
వంకాయ	20	40	బీట్‌రూట్	30	60
పాలకూర	25	50	కరివేపాకు	50	70
మెంతికూర	20	40	చామగడ్డ	50	70
కొత్తిమీర	40	60	గోరుచిక్కుడు	50	80
పుదీనా	60	80	చిక్కుడుకాయ	50	80
క్యాప్సికం	50	80			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

- స్క్రీన్-1 అపరిచితుడు (తెలుగు) - 1.30, 7.30
- స్క్రీన్-2 ది గార్‌ఫీల్డ్ మూవీ (ఇంగ్లిష్) - 10.45, 4.30, 7.30, ఆ ఒక్కటీ అడక్కు (తెలుగు) - 1.40, మిరల్ (తెలుగు) - 10.30
- స్క్రీన్-3 అపరిచితుడు (తెలుగు) - 10.35, మిరల్ (తెలుగు) - 1.50, కింగ్‌డమ్ ఆఫ్ ద ప్లానెట్ ఆఫ్‌ది ఏప్స్ (తెలుగు) - 4.40, 10.30, బాక్ (తెలుగు)-7.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

- స్క్రీన్-1 కృష్ణమ్మ (తెలుగు) - 1.20, 7.25, కింగ్‌డమ్ ఆఫ్ ద ప్లానెట్ ఆఫ్‌ది ఏప్స్ (ఇంగ్లిష్) - 4.15, అపరిచితుడు - 10.20
- స్క్రీన్-2 ది గార్‌ఫీల్డ్ మూవీ (ఇంగ్లిష్) - 12.00, 2.25, 4.50, 7.15, 9.40
- స్క్రీన్-3 కర్తం భుక్తం (హిందీ) - 1.10, ఆ ఒక్కటీ అడక్కు (తెలుగు) - 4.05, శ్రీకాంత్ (హిందీ) - 7.00, 10.00
- స్క్రీన్ -4 నటరత్నాలు (తెలుగు) - 12.10, దర్శిని (తెలుగు) - 2.50, మిరల్ (తెలుగు) - 5.30, 10.30, అక్కడ వారు ఇక్కడ ఉన్నారు (తెలుగు) - 8.25

మల్లన్న ఆలయంలో పూజలు

బాల్కొండ: శ్రీరాం సాగర్ ప్రాజెక్ట్‌లో ముంపునకు గురైన రత్నాపూర్ గ్రామ మల్లన్న ఆల యం ముంపులో నుంచి బయల్పడింది. దీంతో మల్లన్న భక్తులు ఆదివారం అధిక సంఖ్యలో పోటెత్తి ప్రత్యేక పూజలు చేశారు. జగిత్యాల్ జిల్లాలో పునరావాసంలో ఏర్పడిన రత్నాపూర్ గ్రామం నుంచి భక్తులు తరలి వచ్చి స్వామి వారికి ప్రూజలు చేశారు.